

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని ధర్నా

కేసముద్రం, జూన్ 19: మండలంలోని మహమూద్‌పట్నంలో 399 సర్వే నంబర్‌లో 2008లో ఇళ్ల సల్థాలు కేటాయించిన లబ్ధిదారులకు వెంటనే పట్టాలివ్వాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం 36 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించగా, వారిలో కొంతమంది ఇళ్లు నిర్మించుకొన్నారని, మరికొందరు అలాగే వదిలేశారని అన్నారు. ఇళ్లు నిర్మించుకోగా మిగిలిన భూమిలో కేసీఆర్ ప్రభుత్వం పేద లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు ఇవ్వడంతో వారు ఇళ్లు నిర్మించుకుంటున్నట్లు తెలిపారు. కాగా, మొదటగా 2008లో తమకే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని, ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. కాగా, కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన లబ్ధిదారుల జాబితాలో పేరు లేక పోవడంతో మనస్తాపం చెందిన నాగన్న అనే వ్యక్తి 'నాకు ఇంటి స్థలం కేటాయించకపోతే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకొంటానని పెట్రోల్ బాటిల్ పట్టుకున్నాడు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్సై వంశీధర్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడి శాంతింపజేశారు. ఈ కార్యక్రమంలో నరేశ్, సురేశ్, స్వరూప, రాంధన్, నెహ్రూ, పాపమ్మ, పూలమ్మ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE PRL JUNIOR CIVIL JUDGE AT: ASIFABAD

O.S. NO. 38/2021

Between:
Marika Venkateshwarlu S/o Narasimha Ramulu, Occ: Singareni Employee, R/o Q. No. D-148, Goleti Township, Rebbena mandal of Kumaram Bheem Asifabad Dist.
...Plaintiff

AND

Jarupula Suresh S/o Lingha, R/o Manjya Thanda Village, Yerjerla, Maripeda mandal, Mahabubabad Dist., Pin-506315.
...Defendant

That, in the above matter, in spite of several notices through this Honourable court you have been avoiding to receive the notices. Please take notice that if you fail to appear in the above suit on 24-06-2024 before the Honourable PRL JUNIOR CIVIL JUDGE COURT AT ASIFABAD at 10.30 a.m , without fail, either personally or through Advocate, the matter will be decided Exparte, by this Honourable court.

(By order of the court)
Sd/- **KANUKUNTLA RAJESH**
G.VIDHYA SAGAR
Advocates - Asifabad

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా మహబూబాబాద్ జిల్లా, మహబూబాబాద్ మండలం, మల్యాల గ్రామ కావురస్తులుగ శ్రీమతి చేపూరి సుజాత, భర్త: వెంకన్న, నివాసం: గ్రామము మల్యాల, మండలం మహబూబాబాద్, జిల్లా: మహబూబాబాద్ వీరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ మహబూబాబాద్ బ్రాంచ్ వారిని ఋణ సదుపాయం పొందుటకు హామీగా ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని తమ రిజిష్టర్ గిఫ్ట్ దస్తావేజు నెం. 5686/2024, తేది: 27-05-2024 మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ వారి సమక్షములో రిజిష్టర్ కాబడిన దాని ద్వారా సంక్రమించిన ఆస్తిని హామీగా ప్రతిపాదించగా సదరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ వారు తమ సమ్మతిని తెలిపియున్నారు. సదరు షెడ్యూల్ ఆస్తి విషయమై గాని సదరు ఋణ సదుపాయ విషయమైగాని ఎవరికేని ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన (5) దినములలో తగు ఆధారములతో ఈ దిగువ తెలిపిన అడ్రస్ యందు సంప్రదించగలరు. లేని యెడల ఎలాంటి అభ్యంతరములు లేవని తలచి సదరు ఋణ సదుపాయ విషయమై పై కంపెనీ వారు తదుపరి చర్యలు గైకొందురు. గడువు తర్వాత వచ్చిన అభ్యంతరములు పరిగణలోకి తీసుకోబడవు.

షెడ్యూలు ఆస్తి: మహబూబాబాద్ జిల్లా, మహబూబాబాద్ మండలం, మల్యాల గ్రామపంచాయతీ పరిధిలోని ఇ.నెం. 5-82, విస్తీర్ణం 412.40 చ.గ.లు సమము 344.81 చ.మీ.లు గల దానికి హద్దులు: తూర్పు: G.P. రోడ్డు, పడమర: G.P. రోడ్డు, ఉత్తరం: చేపూరి వెంకన్న గారి స్థలము, దక్షిణం: చేపూరి వెంకన్న గారి స్థలము
తేది. 19-06-2024

ఇట్లు: **బి. ఆనంద్ కుమార్,** అడ్వకేట్,
మహబూబాబాద్, 506 101, Cell: 9440241819.

ఆన్‌లైన్ ద్వారా ప్రమోషన్లతో తీవ్ర నష్టం

మహబూబాబాద్ రూరల్, జూన్ 19 : ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వం చేపడుతున్న ప్రమోషన్ల వల్ల టీచర్లకు తీవ్ర నష్టం జరిగిందని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బీ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో టీచర్‌కు మూడు సబ్జెక్ట్‌ల్లో ప్రమోషన్ కల్పించడం జరిగిందని, ఖాళీలు మళ్లీ ఖాళీలుగానే మిగిలి పోతున్నాయన్నారు. మహిళా కేటగిరీ పోస్టులను పురుషులకు కేటాయించడం, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో సీనియారిటీ పాటించడం లేదన్నారు. పదోన్నతులకు సంబంధించి టీచర్ల నుంచి సంసిద్ధత తీసుకోకుండా అర్హత ఉన్న అన్ని సబ్జెక్ట్‌లో ప్రమోషన్ కల్పించడంతో చాలా మందికి నష్టం జరుగుతుందన్నారు. ఉద్యోగోన్నతుల్లో జరిగిన తప్పులను ప్రభుత్వం వెంటనే సరిచేయాలని పేర్కొన్నారు.

నిరంతర విద్యుత్ అందించాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి
- నల్లగుట్టతండాలో విద్యుత్ పనుల పరిశీలన



నెల్లికుదురు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

నెల్లికుదురు, జూన్ 19 : వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి విద్యుత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని నల్లగుట్ట తండాలో సింగిల్ ఫేజ్ టు త్రీఫేజ్ కన్వర్షన్ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం నెల్లికుదురులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ.. ప్రజలు, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్ ఉండాలని, అక్రమంగా విద్యుత్‌ను వినియోగించుకునేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్‌ను ఇచ్చిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వానకాలంలో చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడకుండా, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఆల్టర్నేట్ సప్లయ్‌కి సంబంధించి ఫీడర్లను సమకూర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జీఎం రాజు చౌహాన్, మహబూబాబాద్ ఎస్ఈ జే నరేశ్, తొర్రూరు డీఈ మధుసూదన్, డీఈ టెక్ మహబాద్ అనిల్ కుమార్, విజయ్‌కుమార్, హరినాయ క్, సింధు, భార్గవి, చెలుమయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో విద్యుత్‌కు అంతరాయం కలుగొద్దు

గంగారం : ఏజెన్సీ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం మండలంలోని మడగూడెం గ్రామానికి మంజూరైన 132/33 సబ్‌స్టేషన్ నిర్మాణానికి అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. మండలానికి ఇంకో రెండు సబ్‌స్టేషన్లు అవసరమని అధికారులు సీఎండీకి వివరించగా, మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీజీఎం ప్రాజెక్ట్ అధికారి చౌహాన్, జిల్లా పర్యవేక్షణ ఇంజినీరింగ్ అధికారి నరేశ్, డివిజనల్ ఇంజినీర్ విజయ్, ఏఈలు సురేశ్, మైథిలి పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

కేసముద్రం : మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని బుధవారం ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతర నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు.

రవాణా శాఖ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సర్వీస్ రద్దు

మహబూబాబాద్ రూరల్, జూన్ 19 : జిల్లా రవాణా శాఖలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న ఈ సురేశ్ సర్వీస్‌ను రద్దు చేసినట్లు ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ బుద్ధ ప్రకాశ్‌జ్యోతి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఈడెన్ కరెన్ పేర్కొన్నారు. సురేశ్ మద్యం తాగుతూ విధులు నిర్వర్తించినట్లు మంగళవారం పలు దినపత్రికల్లో కథనం ప్రచురితమైందన్నారు. అతను భవిష్యత్‌లో ఏ సంస్థలో ప్రవేశించకుండా బ్లాక్ లిస్ట్‌లో పెట్టినట్లు చెప్పారు. ఇందుకు సహకరించిన ఇద్దరు ఆర్టీఏ ఏజెంట్లపై కేసు నమోదైందన్నారు.

పీహెచ్‌సీలకు న్యాయం చేయాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 19 : ఉపాధ్యాయుల ప్రమోషన్లలో పీహెచ్‌సీ కోటాలో జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఈవో రామారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ప్రమోషన్లలో దళిత మహిళ రోస్టర్ పాయింట్లలో పురుషుల రోస్టర్ పాయింట్లు నింపారని, అదేవిధంగా స్కూల్‌అసిస్టెంట్ సోషల్, ఫిజికల్ సైన్స్, ఇంగ్లిష్ , బయోసైన్స్ సబ్జెక్ట్‌లల్లో దళిత మహిళా ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందన్నారు. వెంటనే సరిచేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిత, నిర్మల, ఈరూ నాయక్, శివ, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

మహబూబాబాద్ రూరల్, జూన్ 19 : గంజాయి కేసులో ఇద్దరికి పది సంవత్సరాలు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్ బుధవారం తీర్పు ఇచ్చారు. నెక్కొండ మండలం బొల్లికొండ గ్రామానికి చెందిన గుగులోత్ నిజ్జు, కేసముద్రం మండలం బోన మంచతండాకు చెందిన భూక్యా చంటి 2022 మార్చి 9న బైక్‌పై గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. అప్పుడు విధుల్లో ఉన్న ఎస్సై తిరుపతి వారి వద్ద నుంచి 17 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ సర్వయ్య ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారి ఆరుగురు సాక్షులను ప్రవేశ పెట్టారు. పీపీ చిలకమర్తి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించగా, జడ్జి చంద్రశేఖరప్రసాద్ ఇరువురికి పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. సాక్షులను ప్రవేశపెట్టి నిందితులకు శిక్ష పడేలా చేసిన కోర్టు డ్యూటీ కానిస్టేబుల్‌కు దేవా, అధికారులను ఎస్పీ అభినందించారు.

నిలిచిన గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్

డోర్నకల్, జూన్ 19: గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ బుధవారం డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయింది. డీ1 కోచ్‌లో సాంకేతిక లోపం కారణంగా ఆగిపోవడంతో 40నిమిషాల పాటు రైలును నిలిపి రైల్వే సిబ్బంది మరమ్మతు చేశారు. ఈ సమయంలో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

ఇసుక డంపులు సీజ్

నర్సింహులపేట, జూన్ 19: అనుమతి లేకుండా అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను సీజ్ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు బుధవారం తెలిపారు. మండలంలోని బొజ్జన్నపేట, కౌసల్యదేవిపల్లి గ్రామంలో కొంతమంది రాత్రి వేళ్లల్లో ఆకేరు వాగు నుంచి ఇసుకను తరలించి డంపులు చేసినట్లు సమాచారం రావడంతో పోలీసులతో కలిసి దాడులు నిర్వహించామన్నారు. 40 ఇసుక ట్రాక్టర్ల ఇసుక డంపులను సీజ్ చేశామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధ్యాయుడికి ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న విద్యార్థులు

ఉపాధ్యాయుడి బదిలీ.. విద్యార్థుల కంటతడి

ఇనుగుర్తి, జూన్ 19: మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా 14 సంవత్సరాలు విధులు నిర్వర్తించిన కొమ్ము రాజేందర్ కేసముద్రం స్టేషన్‌లోని హైస్కూల్‌కు బదిలీ అయ్యాడు. బుధవారం పాఠశాలకు వచ్చి రిలీవ్ తీసుకునే క్రమంలో విద్యార్థులందరూ ఆయన దగ్గరకు వెళ్లి భావోద్వేగంతో కంటతడి పెట్టుకున్నారు. అనంతరం విద్యార్థులు పాఠశాల గేటు వరకు వచ్చి ఉపాధ్యాయుడిని సాగనంపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నెల్లికుదురు, జూన్ 19 : అక్రమంగా తరలిస్తున్న 23 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం... ఏఎస్సై యాకయ్య, పోలీసు సిబ్బంది మంగళవారం రాత్రి నర్సింహులగూడెం బస్టాండ్ వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా డ్రైవర్ రోడ్డుపక్కన వాహనాన్ని ఆపి పరుగుపెట్టాడు. పోలీసులు డ్రైవర్‌ను పట్టుకుని విచారణ చేపట్టారు. నర్సింహుల గూడేనికి చెందిన సిద్ధబోయిన భిక్షపతి వీఎస్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన సోమయ్య వద్ద పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్మడానికి మార్కెట్‌కు తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసికొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

డోర్నకల్ : చాప్లాతండాలో గుడుంబాను ధ్వంసం చేస్తున్న ఎస్సై తిరుపతి, సిబ్బంది

- 70 మందిపై 12 కేసులు నమోదు
- 1930 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

మహబూబాబాద్, జూన్ 19 : జిల్లావ్యాప్తంగా బుధవారం గుడుంబా స్థావరాలపై మహబూబాబాద్, తొర్రూరు సబ్‌డివిజన్ పోలీసు అధికారులు దాడులు నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామునే దాదాపు 18 పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు చేసి, 70 మందిపై 12 కేసులు పెట్టారు. 1930 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 143 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. మహబూబాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 10 మందిపై, డోర్నకల్‌లో ఆరుగురిపై, మహబూబాబాద్ రూరల్‌లో ఐదుగురిపై, కేసముద్రంలో ఆరుగురిపై, కురవిలో ఆరుగురిపై, కొత్తగూడలో నలుగురిపై, గంగారంలో ముగ్గురిపై, గార్లలో ఆరుగురిపై, పెద్దవంగరలో ఏడుగురిపై, మరిపెడలో 11 మందిపై, సీరోల్‌లో ఆరుగురిపై 12 కేసులు నమోదు చేశారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్ : గుడుంబా స్థావరాలపై బుధవారం డోర్నకల్ పోలీసులు దాడులు చేశారు. చాప్లాతండాలోని భూక్యా పద్మ ఇంట్లో 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ఆమెపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసులు సైదులు, కృష్ణ, శివ, జావీద్, నస్రీన్ పాల్గొన్నారు.

కొత్తగూడలో..

కొత్తగూడ : మండలంలోని పలుగ్రామాల్లో గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు చేసి 40 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై దిలీప్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని పొగుళ్లపల్లి, రేన్యా తండాలో గుడుంబా స్థావరాలపై దాడులు చేసి, 500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 40 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు.

బీఎంపై చర్యలు తీసుకోవాలి

గూడూరు, జూన్19 : గూడూరు యూనియన్ బ్యాంకు మేనేజర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని నవ తెలంగాణ విద్యార్థి సంఘం (ఎన్టీవీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బానోత్ రామన్ననాయక్ బ్యాంకు అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. గూడూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రైవేట్ వ్యక్తులను ప్రోత్సహించి నిబంధనలకు విరుద్ధంగా క్రాప్‌లోన్స్, ఏజెన్సీ చట్టానికి విరుద్ధంగా మార్టిగేజ్ లోన్లు పర్సంటేజీలు తీసుకుని ఇచ్చాడని ఆరోపించారు. అర్హులకు రుణాలు ఇవ్వకుండా సర్వీసులో లేని ఇతర గ్రామాల వ్యక్తుల వద్ద డబ్బులు తీసుకుని రుణాలు ఇచ్చాడని, బీఎంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వరంగల్ రీజినల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

కొత్తగూడ, జూన్ 19 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన కొత్తగూడ మండలం గాదెవాగు వద్ద బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట ఆర్టీసీ బస్సు నర్సంపేట నుంచి ముస్మికి వెళ్తున్నది. ఖానాపురం మండలం చిలుకమ్మనగర్‌కు చెందిన సుమన్, అనిల్ బైక్‌పై కొత్తగూడకు వెళ్లి తిరిగి చిలుకమ్మనగర్‌కు వస్తుండగా గాదెవాగు సమీపంలో మూలమలుపు వద్ద బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానికులు నర్సంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

అరుంధతిరాయ్‌పై ఉపా కేసు ఎత్తేయాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 19 : దేశంలోనే గర్వించదగిన రచయిత, ప్రఖ్యాత బుకర్ ప్రైజ్ అవార్డు గ్రహీత అరుంధతిరాయ్‌పై కేంద్ర ప్రభుత్వం నమోదు చేసిన ఉపా కేసును వెంటనే ఎత్తేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2010 లో నమోదైన కేసును తిరగదోడి విచారణకు ఆదేశించడం అప్రజాస్వామికమన్నారు. ప్రశ్నించే గొంతుకలను బీజేపీ ప్రభుత్వం నొక్కిపెడుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి రవి, ప్రభాకర్, జగ్గన్న, వీరన్న, సూర్య తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా బాధితులు లేకుండా కృషి చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

డోర్నకల్‌లో ర్యాలీ తీస్తున్న వైద్య సిబ్బంది

మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్, జూన్ 19 : జిల్లాలో సికిల్‌సెల్ ఎనీమియా బాధితులు లేకుండా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రపంచ సికిల్‌సెల్ ఎనీమియా డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సికిల్‌సెల్ ఎనీమియా బాధితుల నిర్ధారణ కోసం నిత్యం రక్త నమూనాలను సేకరించి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కళావతిబాయి, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబాల అంబరీష, సూపరింటెండెంట్ జగదీశ్వర్, ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్ : సికిల్‌సెల్ ఎనీమియా దినోత్సవం సందర్భంగా డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి అమ్మపాలెం వరకు వైద్య సిబ్బంది బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సద్విజ, సీహెచ్‌వో వీరాబాబు తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్‌పై అవగాహన ఉండాలి

గూడూరు : సికిల్‌సెల్ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్న అన్నారు. బుధవారం మండలంలోని దవాఖాన ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ.. సికిల్ సెల్ వ్యాధిని నిరోధించేందుకు ఎక్కువ నీటిని తాగడంతో పాటు రక్తాన్ని పెంచే పండ్లు, ఆహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు భరత్‌రెడ్డి, రమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీపాల్‌రెడ్డి, కొమ్మాలు, యాకయ్య, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

24న స్పాట్ అడ్మిషన్లు

నర్సింహులపేట, జూన్ 19: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఈ నెల 24 స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆనందబాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఆదర్శ పాఠశాలలో 2024-25 సంవత్సరానికి సంబంధించి వివిధ తరగతుల్లో ఖాళీలను భర్తీ చేయడానికి ఈ నెల 24న స్మార్ట్ అడ్మిషన్లు ఉంటాయన్నారు. అర్హతగల విద్యార్థులు 22లోపు మోడల్ స్కూల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 24న ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించి, అదే రోజు సాయంత్రం ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులు 25న ఒరిజనల్ ధ్రువ పత్రాలతో అడ్మిషన్ పొందాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

సీఈవో ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లికుదురు/పెద్దవంగర, జూన్ 19 : మండలంలోని మహిళా రైతు ఉత్పత్తిదారుల తాత్కాలిక సీఈవో పోస్టుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎఫ్‌పీసీ చైర్మన్ కాలేరు రమ, ఏపీఎం వరదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 35 సంవత్సరాలలోపు ఉండి, గుర్తింపు పొందిన విద్యా సంస్థల నుంచి అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్, అగ్రికల్చర్ మార్కెటింగ్, అగ్రికల్చర్ బిజినెస్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్ డిప్లొమా లేదా తత్సమాన డిగ్రీ కలిగి ఉండాలన్నారు. ఎఫ్‌పీసీ షేర్ మహిళా వాటాదారుల స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ నెల 24లోపు మండల మయూరి సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. మౌఖిక పరీక్ష ద్వారా అర్హులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అలాగే, పెద్దవంగర మండలంలో 'అవని రైతు నేస్తం' సీఈవో పోస్టుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం రమణాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు 25లోగా మదర్‌థెరిస్సా మండల సమాఖ్యలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలి

కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

మహబూబాబాద్ రూరల్, జూన్ 19 : నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథి డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై ప్రధానిమోదీ మౌనం వీడాలన్నారు. బీహార్, గుజరాత్ రాష్ట్రాల్లో జరుగుతున్న అవకతవకలపై కేంద్రప్రభుత్వం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. హర్యానా రాష్ట్రంలో ఒకే రూంలో 10 మందికి ర్యాంకులు రావడంపై పూర్తి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెరుగుకుమార్, చింతకుంట్ల వెంకన్న, రేషపల్లి నవీన్, ప్రవీణ్, లింగ్యా, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

కేసముద్రం, జూన్ 19: పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న కేసముద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ఎంసీపీఐయూ జిల్లా నాయకుడు కంచ వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు. కేసముద్రంలో అగ్నిమాపక కేంద్రం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ఆయన పలువురు నాయకులతో కలిసి మార్కెట్ ఆవరణలో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వెంకన్న మాట్లాడుతూ.. స్థానిక మిల్లులో అగ్ని ప్రమాదం జరిగితే దూర ప్రాంతంలో ఉన్న మహబూబాబాద్, నెక్కొండ మండల కేంద్రాల నుంచి ఫైర్ ఇంజిన్లు వచ్చే వరకు జరగాల్సిన నష్టం జరిగిపోతున్నదన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు

మహబూబాబాద్ రూరల్